# తొందరపాటు

కుమారి ఇందిర

బాలసూర్యుని పసిడి కిరణాలు కిటికీగుండ వచ్చి నా లేత చెంపను తాకి ముద్దిడినట్లుగా యున్నవి. పాల మనిషి గేదెను యింటి దగ్గరకు తెచ్చి ఝురు...ఝురు మంటూ పితుకుతుంటే సంగీతము పాడినట్లుగా యున్నది. అక్కయ్య పనిపాటలో మునిగిపోయినది. చిట్టివాడు వచ్చి, 'పిన్నమ్మ! లేవవూ!' అంటూ కొంగుపట్టి లాగుతున్నాడు.

దిగ్గున లేచాను. "చిట్టీ, నీ మొఖము చూసాను, రా, ఈ రోజు ఏమవుతుందో చూడాలి!" వళ్లు విరుచుకుంటూ ముందు వసారాలోనికి వచ్చి నిలుచున్నాను.

కాంపౌండ్‌లో వేసిన పూలమొక్కలు సూర్య కాంతికి అప్పుడే విచ్చుకుంటున్నవి. ఎడమవైపు వేసిన ప్రొద్దు తిరుగుడు పువ్వు, తిన్నగా ఉదయ భానునివైపు తిరిగి శ్రద్ధగా అంజలిని సమర్పించినది. అప్పుడే కుసుమించిన గులాబీలు, పారిజాతాలు విరహ వేదన తాళజాలము, 'వచ్చి మమేలుకోనవు' అంటూ వయ్యారంగా పిలుచుచున్నవి. ప్రకృతి పచ్చగా మెరసిపోవుతున్నది. 'డబల్ రొట్టి' అంటూ సైకిల్ మీద పోవు అబ్బాయి, రొట్టిని అమ్ముకుంటూ పోవుచున్నాడు. అతని ధ్వనికి తిరిగి ఈ లోకమునకు వచ్చి పడ్డాను.

ఎడమవైపునుంచి, నన్నెవరో గుచ్చి, గుచ్చి చూస్తున్నట్లుగా తోచుచున్నది. అనుకోకుండ, నా దృష్టి ఆ వైపుకు ప్రసరించినది.

తెల్లటి పంచ, కండరాల కంటుకొనిపోయిన బనీను, భుజముపైన పచ్చటి టర్కీటవల్, నోటిలో బ్రషు, ముంగురులు కంటి కడ్డముగా పడుతున్నప్పటికి, తీసుకొనుటకు ప్రయత్నించకుండ నావైపే చూస్తున్నాడు. ఆ చిలిపి చూపులు, కొంటె నవ్వులు నన్ను ఉక్కిరిబిక్కిరి చేశాయి. ఒక్క నిమిషమైన అక్కడ నిలబడలేకపోయాను. వెంటనే లోపలికి దౌడు తీసినాను.

ఎవరబ్బ, ఈ మన్మధుడు. - ఎంత అందంగా యున్నాడు! నల్లటిజుట్టు వంకులు తిరిగి, చిందరవందరగా ఎలా నాట్యమాడుచున్నవో చూడు. అబ్బ... ఇంక, ఇటువైపే కిటికీగుండ చూస్తున్నాడు కదా! ఎంత గడుసరిగా నున్నాడు! నిజంగా ఈ కలియుగ మదనుని వశపరుచుకొన్న రతి ఎవరైయుండును. ఆ యింటిలో ఒక్క ముసలామె మాత్రమే నిన్నటి రోజునుంచి కనబడుతున్నది. పెండ్లి కాలేదు కాబోలు. వివాహితుడైన నన్ను రెప్పవాల్చకుండ చూడవలసిన అవసరమేమున్నది! ఈ అందాలరాయునికి ఎంత చక్కటి పేరు యుండునో! ఏ ఆఫీసులో పని చేయుచున్నాడో? జీతమెంత అయియుండునో? పోనీ, అక్కయ్యను అడిగి వివరాలను తెలుసుకొంటే! అమ్మ, బాబో, ఏమైనయుందా! చెంపకు రెండు అంటించదూ! పోని ఒక ఉత్తరము ముక్క వ్రాసి, కిటికీగుండ వేసిన సమ్మతిస్తాడో, లేడో... ఇష్టము లేనియడల, ఎందుకలా చూస్తాడు? కాలేజిలో సుందర్ కూడ, ఇలాగే కదూ! చూస్తూయుండి ప్రేమంటూ నా ఎదుట వలుకపోనేందుకు వచ్చింది. అంతెందుకు మా పక్కింటి గోపి, కాలేజి లీడర్ కుమార్, ఇతనిలాగే కదూ వెకిలిగా నవ్వుతూ, చిలిపిగా చూస్తూ నన్ను ప్రేమిస్తున్నామని, ప్రేమ లేఖలను కనకవర్షములా కురిపించింది! ఆ నడవడికలు, ఆ చూపులు చూస్తుంటే, నిజంగా అతను నన్ను ప్రేమిస్తున్నట్లుగానే తోస్తున్నది. ఎంతని కనుగొన గలము ఈ కాలపు అబ్బాయిల మనస్తత్వాలు! ధైర్యే... సాహసే... లక్ష్మి అన్నారు. వేచి చూస్తాము ఒక పాచికి.

♦ ♦ ♦

ప్రియమైన...

మీ పేరు తెలియక మిమ్మలను పేరుతో సంబోధించలేకపోవుచున్నాను. మీ దర్శన భాగ్యమునకు వుప్పొంగిపోయాను. మిమ్మలను చూడగానే, ఏదో దేవదూత నా ఎదుట వచ్చి నిలబడ్డదని భ్రమ కలిగింది. విశాలవక్షము, వంపులు తిరిగిన కండరాలు, చక్కటి కళ్లు, ఉంగరాల వెంట్రుకలు నన్నిట్టే ఆకర్షించినవి. నిజంగా మీరు ధన్యజీవులు. నా చూపే చాలని, నా పిలుపే బంగారమని క[illegible]ంచు

నా సహవిద్యార్థులకు పెడదారి చూపినాను. మిమ్ములను చూస్తుంటే నాకెందుకో మనస్సు కలవరము చెందుతున్నది. నా పేరు సుమిత్ర. ఉస్మానియా కాలేజిలో బి.ఏ. పరీక్షలు వ్రాసినాను. సెలవుల్లో రోజులు గడుచుట కష్టముగా యున్నందున ఇక్కడికి మా అక్కయ్య దగ్గర కొన్ని రోజులుండి పోవుదమని వచ్చినాను. ఈ వసంత్‌నగర్ ప్రకృతి నాకు బాగా నచ్చింది. ఇంక రెండు మూడు వారాలుండి గాని, సిటీలోనికి పోను. క్రిక్కిరిసిన ఆ నగరాలలో యుండుటకన్న, ప్రశాంతమైన ఈ బయలు స్థలములలో ఎంతో ఆరోగ్యకరముగా నుండును.... రాజా! ప్రతి స్త్రీ తన ప్రియుని సంబోధించుటకు ఉబలాటపడు పేరుతోనే, మిమ్ములను కూడ పిలుచుటకు ఉవ్విళ్లూరుతున్నాను. నేను వ్రాసిన ఉత్తరమునకు కినుక వహించక, నాపైనున్న మీ ప్రేమానురాగమును సవిస్తారముగా తెలియపరిచెదరని నమ్ముతూ ఇక చాలిస్తున్నాను.

ప్రేమతో,
మీ
సుమిత్ర

♦ ♦ ♦

గడియారం 9 గంటలను చూపిస్తున్నది. అతడు ఏమి చేస్తున్నట్లు! ఇంతవరకు బదులు వ్రాసి పంపలేదు. కాలకృత్యములలో మునిగియుండవచ్చు. అదుగో, స్నానముచేసి కాబోలు వస్తున్నాడు. ముత్యాలలాగా నొసటిమీద నీటిబిందువులు మెరసిపోవుచున్నవి. క్రాపు అంతా పూర్తిగా చెదిరిపోయినది. చెవిని టవలుతో తుడుచుకుంటూ తిన్నగా కిటికీ దగ్గరకు వచ్చినాడు. అతని ప్రతి పనిలోను ఒక కొత్త తీరు కనబడుచున్నది. నడక మంచి స్టయిల్‌లో యున్నది. ఎంత వయ్యారంగా నవ్వుతాడు. ఏమి యీ సైగలు...ఓహో!...బదులు వ్రాస్తాడంట... ఆఫీసుకు పోవునప్పుడు యింటి ముంగట వేసి పోవునట, పోయి తీసుకొనవలయునట...

సస్‌ప కలర్, గ్యాబర్డిన్ ప్యాంటు, తెల్లటి షర్టును టక్ చేసికొని, బూట్లు టక్‌టక్ మంటూ శబ్దము చేసికొంటూ యింటి ముంగటినుంచి పోవుచు, జేబురుమాలను తీయునట్లు నటించుచు, ఒక తెల్లటి చీటీని పారవేసి పోయినాడు. ఏదో ముత్యం పడ్డట్లనిపించింది. గేటు తీసుకొని, ధైర్యముగా ముందుకు పోయినాను. ఎవరో సైకిలుమీద పోవుచూ, చీటీ మీదుగా సైకిల్ పోనిచ్చినారు. జనమంత ఆఫీసులకు పోవుచున్నారు. చీటీ తీసుకొనునప్పటికి తల ప్రాణము తోకకొచ్చింది.

♦ ♦ ♦

సుమిత్ర ప్రియా!

నీ ముత్యాలలాంటి అక్షరములను చూసి ముగ్ధుడైనాను. వంపులు తిరిగిన శరీరము, సింహ మధ్యము, బిగువైన కండరాలు, తెల్లటి నీ పలువరుస, వెన్నెలలాంటి నీ చిరునగవు, లేత పెదవులు, కిన్నెర స్వరములాంటి నీ కంఠము నన్ను మైమరపించి, నిన్ను నా సొత్తుగా చేసికొని తీరవలయునని నా మనస్సు ఉవ్విళ్లూరుతున్నది. ఇప్పుడు ఆఫీసుకు పోవుచున్నానే కాని పని సక్రమంగా చేస్తానన్న నమ్మకంలేదు. ఉత్తరము వ్రాస్తూయుంటే నీ కమనీయమైన ముఖము వచ్చి కళ్లు చిట్లిస్తూ, ఎదురుగా సాక్షాత్కరించినట్లుగా నున్నది. నాకు కవిత్వములో ఏమంత ప్రావీణ్యతలేదు, నిన్ను వర్ణిస్తూ కూర్చొనజాలను. ఒక్కమాటలో చెప్పుచున్నాను _ నీ సొగసు నాకు బాగా నచ్చింది. నేను నిన్ను మనసారా ప్రేమిస్తున్నాను. నీ అమృతహస్తాలతో నన్నెన్నడు బిగించగలవు! చక్కటి నీ కళ్లతో నా చిలిపిచేష్టలను ఎన్నడు మందలించగలవు! వెన్నెల రాత్రులలో ఎన్నడు మనమేకమై తిరుగగలము! ... ఆఫీసుకు టైమగుచున్నది. ఈ రోజు మా అమ్మగారు కూడ బంధువుల యింటికి పోవుచున్నది. నీవు సరిగా గం. 6_30 లకు వీలు చూసుకుని నా రూములోనికి వచ్చెదవని నమ్ముచున్నాను. మిగత విషయాలు మన యిద్దరి సమక్షం... ఇక ఉండనా, మరి.

ఇట్లు,
నీ
ఆనంద్.

♦ ♦ ♦

'ఆనంద్'...ఎంత చక్కటి పేరు. కవిత్వము గాదని, కవిత్వమంతా వొలకపోసినావు కదయ్యా! తెల్లటి నీ పలువరుస...వెన్నెలలాంటి చిరునగవు... లేత పెదవులు. అబ్బా! కవి కాళిదాసును మించినవాడవుగా నున్నావు. ఉత్తరాన్ని ఎన్నిసార్లు చదివానో లెక్కలేదు. చదువుతూ అలాగే కళ్లు మూశాను.

ఒంటిగంట అగుతుంది. చిట్టి వచ్చి భోజనానికి

లేపాడు. తినేందుకు కూర్చున్నానే కాని ఏమి సరిపడడములేదు. మనస్సంత ఎందుకో కలవరముగా నున్నది. రెండు మెతుకులు ఎంగిలి చేసి వచ్చి తిరిగి పరుపుపై పరుండి అటుయిటు దొర్ల నారంభించినాను....

◆ ◆ ◆

"ఆనంద్! నాకన్న ముందుగానే వచ్చావే, ఆహా! నిజంగా ఈ డ్రస్సులో ఎంత అందంగా యున్నావు. తెల్లటి పైజామా, గ్లాస్కో లాల్చి, నల్లటి కళ్లజోడు – ఈ డ్రస్సు నాకు బాగా నచ్చుతుందని ఎలా తెలుసుకున్నావు?"

"నీవు మాత్రము, నాకు నచ్చని డ్రస్సులో నాయున్నావు! లేత కనకాంబర రంగుచీర, నీలాకాశపు రంగు వెల్‌వెట్ బ్లౌజు, నాకు యిష్టమైన సన్నజాజులు నీ శిగలో, ఆహా! ధగధగ మెరసే మెళ్లోని నెక్‌లెస్ సుమీ! నిన్ను చూస్తే, ఆ రతి నీకన్న అందంగా యుండునా అనిపిస్తుంది సుమా!"

"పోనీ, చాలించండి మీ పొగడ్తలు. అదుగో, ఆ కొలను చూడండి ఎంత సోయగాన్ని గూర్చుచున్నదో. అమృతములాంటి ఆ నీటి మధ్యమున, రత్నాలలాగా ఆ కలువలు మెరుస్తున్నట్లు లేదూ! పదండి సమీపించి ఆ అందములో మనము కూడ భాగము పంచుకుందాము."

"ఆనంద్! ఈ తుమ్మెదలు కమలముల చుట్టూ ఎందుకలా ప్రాకులాడుతూ, వాటిపైన వ్రాలుచున్నవో చెప్పగలవా?"

"బి. ఏ. చదివిన అమ్మాయివి, ఈ మాత్ర తెలియకుండునా!" కావాలని అడుగుచున్నావు కదూ! మరేమిలేదు, "కమలము తన అందాన్నంతటిని విప్పి, తుమ్మెదలను అట్టే ఆకర్షించి, వాటితో స్నేహము చేసికొని, హాయిగా కాలము గడుపును."

"ఒకవేళ కమలము వాడిపోయి వికసించుటకు శక్తిలేని సమయమున?"

"తుమ్మెద మరో వికసించిన కమలమును వెదుక్కుంటూ పోయి దానితో స్నేహమునకు చేయి కలుపును."

"అలాగే నాకు ఏదైన లోటు సంభవించిన, నీవు కూడ..."

"సుమిత్రా, ఏమిటా మాటలు" అంటూ తన మునివ్రేళ్ళతో నా నోటిని మూసినాడు.

"ఎన్ని కష్టాలు రానీ, నిన్ను నానుండి ఎవ్వరూ వేరుచేయజాలరు. కలో, గంజియో, ఇరువురము సమముగా త్రాగి కష్టాలను ఎదుర్కొంటూ, మన ప్రేమలతను ఆకాశము వరకు పెంచి, ధృవతారను కలుసుకొని అతనివలె మన ప్రేమ, అనురాగము, బాంధవ్యము కలకాలము ప్రకాశించునట్లు చూస్తాను. మరేమి భయపడకు. నేను నిన్ను తప్ప మరెవరిని వివాహమాడను....అదుగో, ఆ కృష్ణభగవానుని గుడి దగ్గరకు పోయి, అతని సమక్షములో మన మిరువురి మధ్యనున్న పెండ్లి కాలేదనెడి తెరను తొలగించి, హాయిగా ఈ రాత్రి వెన్నెలలోనే గడిపి తిరిగి పోవుదము..."

◆ ◆ ◆

"ఏం సుమిత్రా, ఏమిటా పాడునిద్ర ప్రొద్దస్తమానము–లే" అంటూ అక్కయ్య తట్టి లేపేంతవరకు అది నాకు వచ్చిన కల అని తెలియదు.

"పగటి కలలు కంటున్నావా!" అంటారు పెద్దలు. అవంటే నాకు బొత్తిగా నమ్మకము లేకుండెను. పగలు కూడ కలలు వస్తాయా అంటూ భ్రమపడేదానను. నిజంగా ఎంత చక్కటి కల. శనిలా వచ్చి, బంగారులాంటి నా కలను పాడుచేసింది. కృష్ణ భగవానుని సమక్షములో ఏమి జరిగియుండునో... ఆనంద్‌తో హాయిగా ఆ వెన్నెలరాత్రిని కలలోనైన అనుభవించకుండ చేసింది. నిజంగా నా కలే నిజమైతే నా అంత అదృష్టశాలి ఎవరున్నారు. ఆనంద్ లాంటి అందగాడు భర్త కావడముకన్న నేను ఈ ప్రపంచములో కోరుకొనునదేమున్నది.

◆ ◆ ◆

వానకురిసి వెలిసింది. గగనాన తెల్లటి కొంగలు బారులుగా తీరి తోరణము కట్టినట్లుగా యున్నది. ఆకాశాన ఇంద్రధనస్సు ఏర్పడ్డది. మలయమారుతము చల్లగా వీస్తున్నది. నిజంగా ప్రకృతి అందాల ఆభరణాలను తొడుక్కున్నట్లుగా యున్నది. ఒక్కొక్కరుగా ఆ కాలనీలోని వనితలు నీటుగా సింగారించుకొని వాకిటిముందు వచ్చి నిలబడ్డారు. అప్పుడే నాలుగవ నంబరు యింటి బట్టతలమనిషి, సంచీ నిండుగా కూరగాయలను తీసుకొని సైకిల్ దిగినాడు. ఆ యింటావిడ ఆప్యాయంగా వచ్చి చేతిలోని సంచిని తీసికొని, తిన్నగా ఒక చిరునగవు విసరింది. అబ్బ, ఇంత వయస్సులో కూడ వారు ఎంత అన్యోన్యంగా

యిస్తారు! అలాగే 6-వ నంబరు నవజవ్వని, భర్త తెచ్చిన ఫైల్సుకట్ట నందుకొని కుశలప్రశ్న లడుగు చున్నది. అప్పుడు తెలిసింది, ఈ వనితలు వాకిటి ముందు నిలబడుటకు కారణాలు. పాపం, ప్రొద్దు నంగా ఇంత తినిపోతారు. ప్రొద్దస్తమానము ఆఫీసులో ఫైల్సులతో పోట్లాడి, ఆఫీసర్లతో చీవాట్లు తిని పాలిపోయిన ముఖాలతో ఇండ్లకు వస్తారు. అటువంటి వారికి ఆ కాస్త చిరునగవుతోనైన స్వాగతము యిల్లాలు పలుకకపోయిన ఆ వ్యక్తి బేజారైపోడూ! "గృహమే కదా, స్వర్గసీమ!" అన్నారు. ఎన్ని కష్టాలు, చీవాట్లు, ఇబ్బందులు పడి వచ్చినప్పటికీ, యింటిలోని పిల్లలను, భార్యను చూడగానే ఏ మనిషి అయినా అట్టే మరిచిపోకుండ మానడు!

అందరికి వారివారి భార్యలు చిరునగవుతో ఆదరించిరి. పాపం, నా ఆనంద్‌కు ...... ?

'నీవున్నావుగా' అన్నది అంతరాత్మ.

అంతే, ఐదు నిమిషాలలో తయారైనాను. కలలో నేను కట్టిన తెలకనకాంబరపు రంగుచీర, నీలాకాశపు వెల్‌వెట్ బ్లౌజు, నా నెక్‌లెస్ తెచ్చేటందుకు మరిచిపోయినందున, అక్కయ్యది వేసికొన్నాను. అద్దములో ఏ అయిదారు సార్లు చూసుకున్నానో. తిలకము తీసి దిద్దుకుంటుంటే, "అంతా మె ఆనందం" అను పాట తనంతటతానే నోటిగుండ వచ్చింది. కుడిచేతికి ముంజేతివరకు ఎర్రటి గాజుల నెక్కించినాను. ఎడమచేతికి రిస్టువాచి, లైటుగా మొగాన పౌడర్. 'రండి, నాతో పోటీకి నిలబడగలరా' అన్నట్లుగా నేనుకూడ వాకిట్లోకి పోయినాను.

పోయినదే తడవుగా బావగారు సైకిల్ దిగి వచ్చారు.

"ఏం సుమిత్రా! ఇవాళ నీవున్నావు? నిజంగ ఎంత అదృష్టమోయ్ కోజా. మీ అక్కయ్య ఏం చేస్తున్నది?" అంటూ నవ్వుతూ దగ్గరకొచ్చాడు.

"చిట్టికి స్నానము చేయిస్తుంది" అంటూ "అక్కయ్యా! బావొచ్చాడే" అంటూ కేక వేసాను. పాపం బావకూడ, 'లక్ష్మి' అంటూ యింటిలోనికి పోయినాడు.

అదుగో, నా ఆనంద్ వస్తూనేయున్నాడు. తల పైని ముంగురులు నీటుగా నొసటిపై పడి [illegible] [illegible]. ఆనంద్ ఎంత [illegible]

అందంలో లోటేమి కానరాదు. 'నిన్ను అందంలో గెలుచువారెవరయ్యా' అనుకొన్నాను.

ఇంటి దగ్గరకొచ్చాడు. నాకన్న ముందుగానే ఒక చిరునగవు విసిరాడు. మంచి గడుసువాడే. నేను కూడ మందహాసము చేయుట మానలేకపోయితిని. మా రెండు చిరునగవులు నడిద్రోవలో ఢీకొన్నవి. తిన్నగా తన గదిలోనికి పోయాడు.

ఇక నాకేమి పనియున్నదక్కడ? "నీ డ్యూటీ అయినది లోపలికి పోవచ్చు" అన్నారెవరో నాలో. మెల్లగా యింటి లోపలికి పోయినాను. బావగారు వాలుకుర్చీలో కూర్చుని, కాఫీ చప్పరిస్తున్నారు. అతని ముందున్న స్టూలు లాగుకొని అక్కయ్యకు కాఫీ కార్డరిచ్చాను. చిట్టిచేత కాఫీ పంపింది అక్క. పాపం వాడు వణుకుతున్న చేతితో కాఫీ పట్టుకొని వస్తున్నాడు.

'చిట్టీ! నాపైన ఎంత ప్రేమ!' అంటూ వాడి చేతిలోని కప్పును తీసుకొని, వడిలోనికి ఎత్తుకొని గట్టిగా ముద్దుపెట్టుకున్నాను.

"ఆ...ఆ...ఇంక చాలు, రేపు పెండ్లికాగానే నీకు పుట్టబోయే చిరంజీవికి కాస్త యుంచుకో" అన్నాడు బావ.

"పో, బావా! నీకెప్పుడు పెండ్లి గొడవలే, అసలు నేను పెండ్లే చేసికొనదలచలేదు."

"ఆ, ఇలాగే అనేది పెండ్లి కాబోయే అమ్మాయిలంతా."

ఒక పది నిమిషాలు చర్చించుకున్నాము. తరువాత బావ క్లబ్బుకని బయలుదేరినాడు. ఇదే సమయము అక్కయ్యతో సికార్ వెళ్లుతున్నానని చెప్పి ఒక చిన్న నవలచేతపట్టుకుని తిన్నగా ఆనంద్ యింటికి, యింటి యజమానురాలికన్న ఎక్కువ ధైర్యముగా పోయాను. వాకిలి తెరిచియుంచబడినది. ఆనంద్ తెల్లటి పైజాము, గ్లాస్కోలాల్చి, ఆకుచెప్పులు, అచ్చంగా నేను కలలో చూసిన డ్రస్సులో వాలు కుర్చిలో మేనువాల్చి అప్పుడే వచ్చిన పత్రిక కాబోలు తిరగవేస్తుయున్నాడు.

లోపలికి అడుగుపెట్టి, మెల్లగా ఒక పాడి దగ్గు దగ్గాను.

(సశేషము)

# తొందరపాటు

కుమారి ఇందిర

(గత సంచిక తరువాయి)

ఉలిక్కిపడ్డాడు. "నీవా, ఎంత ధైర్యము చేసావు. ఎవ్వరు చూడలేదు కదూ" అంటూ మా యింటికి కనబడు కిటికీ తలుపులను మూసివచ్చాడు.

"గెటిన్, సుమిత్ర" అంటూ చిరునగవుతో ఆహ్వానించాడు.

ఇంతకు మునుపు అతని అందమును దూరమునుండి చూసి మురిసిపోవుచుంటిని. ఇప్పుడు మిగులా దగ్గర నుంచి చూడ అవకాశము లభించినందులకు నాకెంతో ఆనందమయినది. మనస్సంతా అదోమాదిరయినది. క్షణముకూడ అక్కడ నిలబడలేకపోయినాను. వెంటనే గదిలోనికిపోయి, ఆనంద్ ముందున్న, కేన్ చేర్‌ను లాగుకొని మేనువాల్చి నా లేతదేహమునకు కాస్త విశ్రాంతినిస్తూ ఒక ఘాడ నిట్టూర్పు విడిచాను.

ఎడమవైపు రతీ, మన్మధుల క్రీడాభంగిమలో నొక క్యాలండర్, కుడివైపు పార్వతి, శివుల నృత్యమొనర్చు బెంగాల్ కెమికల్స్ వారి క్యాలండర్లు బాగా అలంకరించబడినవి. అన్నిటికన్న ఆనంద్ ఏదో ధ్యానములో నిమగ్నుడైనట్లు తీయించుకున్న ఫొటో ఆ గదికి మిగుల సోయగాన్ని కూర్చినది. టేబుల్ పైన చిన్న ఫిలిప్స్ రేడియో, దగ్గరలో ఒక చిన్న బుద్ధభగవానుని విగ్రహము, నిజంగా ఆ గది చాల అప్ టు డేట్‌గా అలంకరించబడినది.

"సుమిత్రా! గది బాగుందా?" అని ఆనంద్ చెప్పేంతవరకూ అతని ఫొటోనే చూస్తూయుండిపోయాను.

"బాగులేకుంటె, వస్తానా!"

"ఓహో! చాల చురుకైనదానవే" అంటూ నా బుగ్గపై తన మునివ్రేళ్ళను తెచ్చి నాట్యమాడించినాడు.

వళ్లంత జలదరించినది. అతని స్పర్శకు శరీరమంత ఐస్‌లాగా చల్లబడ్డది.

లేచివచ్చి తన వేడిబాహువులలోనికి నా వంపులు తిరిగిన పసిడి శరీరాన్ని గట్టిగా బిగించి, నా లేత పెదవులను తనివితీర చుంబించాడు.

"వస్తాను, ఆనంద్" అంటూ వాకిలి తెరుచుకొని బైటికి వచ్చాను.

"థ్యాంక్స్" అన్నాడు.

"నో మెంషన్" అయినా చెప్పేందుకు నోరాడలేదు. బావ వచ్చి కాంపౌండు గేటు దగ్గర నిల్చున్నాడు. వళ్లు వణికిపోయినది. ధైర్యముచేసి ముందుకు పోయాను ఏమెరుగనట్లుగా.

"ఏం, సుమిత్రా, ఎక్కడనుంచి రాక" అని ఆప్యాయంగా పలుకరించాడు. పేట్లాటలో బాగా డబ్బు వచ్చింది కాబోలు.

"ప్రొద్దుపోక, అలా షికారు వెళ్ళివస్తున్నాను" అంటూ సమాధానము చెప్పి తిన్నగా గదిలోనికిపోయి పడ్డాను.

రోజులు హాయిగా దొర్లిపోతున్నవి. మా కళ్లు ఒకరితో నొకరు సంభాషణ లాడుకొనుచున్నవి. ఆనంద్‌ను చూడనిది ఒక్క నిమిషమైన గడుపుట కష్టమైనది. ఆఫీసుకు పోయిన 8 గంటల కాలమును 8 యుగాలుగా గడుపుచున్నాను. ఒకరోజు ఆనంద్ మామూలుగా ఆఫీసుకు పోవుచూ ఒక ఉత్తరాన్ని మా యింటిముంగట వేసి పోయినాడు.

♦ ♦ ♦

ప్రియమైన సుమి,

నీ ప్రేమనురాగములకు నేను సర్వదా కృతజ్ఞుడను. నీతో గడిపిన ఆ మధురక్షణాలు ఆజన్మాంతము నా హృదయములోనే పాతుకొనిపోవునట్లు చూస్తాను. ముఖ్యంగా నీకు వ్రాయుదమేమనగా నేను

ఒక మంచి క్రికెట్ టెస్టు ప్లేయరునని చెప్పుటకు మరిచిపోయాను. నిన్నటిరోజున మాకు ఇంగ్లాండు పర్యటనకు ఆర్డర్లు వచ్చినవి. ఈ రోజు సాయంత్రమే, మేమంతా కలిసి విమానములో బయలుదేర వలయును. కనీసము ఒక నెలపాటు అయిన అక్కడ యుండవలసివచ్చును. ఈసారైన మన ఇండియా గెలుపొందినదంటే అదంతా నీ చలవు అనియు, నీ స్నేహ భాగ్యమే నాకు విజయము చేకూర్చినదని నా మిత్రులందరికి... లేదు... లేదు, మొత్తం మన ప్రజానీకమునకు పేపర్లద్వారా తెలుపకుండ మానను. ఇది నా కడసారిచూపు... ఛీ, ఛీ, అనకూడదు. నేను త్వరగా తిరిగివస్తాను. తప్పక నిన్ను కలుసుకుంటాను. మరేమి బెంగపెట్టుకొనవుకదూ! సుమిత్రా నేను పోవుచున్నానేకాని, నా మనస్సును మాత్రము నీకే అప్పగిస్తున్నాను. ఏలోటు లేకుండా కాపాడుకొను భాగ్యము నీదే. ఆఫీసు టైమగుచున్నది. ఇక ఉండనా మరి.

ప్రేమతో
నీ
ఆనంద్

నా కంటినుండి రెండు వేడినీటి బిందువులు రాలి పరిగా ఆనంద్ అన్న పేరుపై పడి చెడిపివేసినవి. నాకు నిజంగా భయమేసింది. ఒక్క నెల, 30 రోజులు అమ్మ బాబో, ఎలా గడిపేది. ఒక్క నిమిషము చూడనిదేయుండని ఈ సుమిత్ర, అన్ని రోజులు ఓర్చుకొని యుంటుందంటే కల్ల. కాని ఏమి చేస్తాము. ఆనంన్ సంతోషంగా ఇంగ్లాండు పర్యటనచేసి విజయాన్ని మనదేశమునకు చేకూర్చి నాకు మంచి బహుమతులు తేకపోతాడా!

◆ ◆ ◆

కాలచక్రము గబగబ దొర్లిపోవుచున్నది. సూర్య భగవానుడు తన దినచర్యను ఒక్క దినముకూడ సెలవు తీసికొనక చేసుకుంటూ పోవుచున్నాడు. అప్పటికి ఆనంద్ పోయి సుమారుగా ఒకవారం అవుతుంది. నా ఆనంద్ పోయినప్పటినుంచి నా మనస్సులో మనసు లేదు. ఏదో అర్థములేని ఆలోచనలు. క్షణక్షణం నాలోని భావాలు క్రొత్తవేషాలు వేసుకుంటున్నవి. ఆనంద్ ఎన్నడు తిరిగి రాగలడు? నా జీవితమునకు నవవసంతోత్సవ మెన్నడు చేయగలడు? నా ఆశలకు అంతులేదు. నా వాంఛలు గగనానికి ఎగిరిపోవుచున్నవి.

సనత్‌నగర్ నుండి వచ్చి అప్పటికి రెండు రోజులగుతుంది. అప్పుడే వేసిపోయిన వార్తపేపరును తీసుకొని చూస్తూ కూర్చుండిపోయాను. క్రీడారంగంపైకి అనుకోకుండా దృష్టి ప్రసరించినది.

“ఆనంద్ అపారమైన ప్రతిభవలన ఇండియాకు ఇంగ్లండులో డ్రా చేసుకొను అవకాశము లభించినది. 150 పరుగులు నాట్ అవుట్‌తో నిలిచిన అంబాలమూర్తి ఆనంద్‌కు భారతావని ఎంతయో ఋణపడియున్నది” అంటూ గుండ్రటి అక్షరములతో ముద్రించినవార్త నా మనస్సుకు ఆహ్లాదము కూర్చినది.

హృదయపంజరములోని నా ఆశాచిలుకను నింగికి ఎగరేసి ఎన్నడు దిగివచ్చునా అని చూస్తూయుండిపోయాను. నా అందాలగని, నా జీవనవాణి, నా మహోజ్వలవాహిని, అనురాగాలతో నిండిన నా ఆనంద్ ఎన్నడు తిరిగి రాగలడు. నా ఊహలు విజృంభించి పోవుచున్నవి. నా ఆనందము గట్లు త్రెంచుకొని ప్రవహించుచున్నది. పేపరు ముఖముపై వేసుకొని ఒక కునుకు తీసినాను.

◆ ◆ ◆

ఆనాడు ఆదివారం. ఉద్యోగులకందరికి పర్వదినమంటూ ఆనంద్ నాతో ఎన్నోసార్లు చెప్పుచుండెడివాడు. గడియారం 6 గంటలు కొట్టింది. మెల్లగా లేచి ముస్తాబైనాను. ప్రొద్దుపోవడము కష్టమని తిన్నగా గార్డన్‌వైపు దారితీశాను.

భాస్కరుడు బాగా అలసిపోయినట్లుగా యున్నాడు. విశ్రాంతికొరకు కాబోలు ఆకాశపు వడిలోనికి చొచ్చుకొని పోవుచూ పసిడి రంగును గగనమంతా వెదజల్లినాడు. జంట జంటలుగా పక్షులు తమ గూళ్ళకు పయనమగుచున్నవి. గార్డన్ అంతా క్రిక్కిరిసినట్లున్నది. ఒకవైపునుంచి ఒక కుర్రకారు నావైపు చూస్తూ, “అచ్చంగా వైజయంతిలాగా లేదు” అంటాడొకడు. “కాదు... కాదు... సరోజదేవి లాగుందిరా” అంటాడు మరొకడు. ఇంతకు వారిమధ్య ఒక చిన్న పోట్లాటను లేపి నా పాటికి నేను పోవుచున్నాను.

నా చూపులు దూరానపోయే ఒక వ్యక్తిపై ప్రసరించినవి... అతనే... ఎవరికొరకు నా హృదయ కవాటములు తెరచియుంచినానో... ఏ ఆరాధ్యదేవత కొరకు నా జీవనజ్యోతిని ఆరకుండ దేదీప్యమానముగా వెలిగించుచున్నానో... ఏ అంబాలబరిణి

కొరకు నా హృదయమందిరము నిండుగా కుంకుమను వెదజల్లియుంచినానో... ఆ అనురాగమూర్తి... నా ప్రేమదేవత, నా అందాల ఆ...న...ం...ద్.

వెంటనే నా ఆశాలత చిగురించి గగనానికి ప్రాకిపోవుచున్నది. మధ్యలో ఒక గద్ద వచ్చి ఆ లతను మధ్యకు త్రుంచిపోయినది. ఒక భాగము నా హృదయముపైపడి ఝల్లుమని కొరడాదెబ్బలాగా తగిలింది. మరొకటి అలాగే ప్రాకిపోయింది. ఆనంద్ ప్రక్క ఎవరో ఒక స్త్రీమూర్తి నడచిపోవుచున్నది. నా వళ్ళంత జెర్రులు ప్రాకినట్లైనది. బుర్రంత రైలుబండిలాగ పరుగులు తీస్తుంది. తొందర పనికిరాదు. పోయి విషయము కనుగొందమనిపించింది.

దగ్గరకుపోయి పిలిచినాను. నన్ను చూస్తూనే మెల్లగా నవ్వాడు. అదే మూర్తి. ఏనాడు నాకు తొలిసారిగా చిరునగవుతో దర్శనమిచ్చినాడో అదే విధంగా యున్నాడు ఏమి మార్పురాలేదు. తన ప్రక్కనున్న వ్యక్తిని పరిచయము చేశాడు. భార్యట... పెళ్ళి అయి ఏడాదగుతుందట... ఇప్పుడు ఆరు మాసాల గర్భవతట. నేను అతని యింటికి పోయినప్పుడు పుట్టింటికి పోయియుండెనట. నా ఆశాసౌధము పేకముక్కలలాగా కూలిపోయినవి. నా కాళ్ళ క్రిందున్న భూమి కదిలిపోతూ నన్ను అగాధానికి తీసుకొని పోవుచున్నట్లున్నది. ఒక్క క్షణముకూడ అక్కడ యుండేందుకు మనస్సురాలేదు. తలనొప్పిగా యున్నదని సాకుచెప్పి యింటికి బయలుదేరినాను. గదిలోనికి పోయి గడియ వేసుకొని దిండులో తలదూర్చి, దిండంతనూ కన్నీటితో తడిపివేశాను... వ్రాయుటకు కలం జరుగకున్నది. నా బాధను అనుభవించినవారికే తెలియును. హృదయమున్న మహాశయులారా! నా వ్యధను కాస్త ఆలోచించి చూడండి.

నా కాంక్షాజ్యోతి ఆరిపోయినది. నడి సముద్రములో పయనిస్తున్న నా జీవననావ తెరచాపను ఎవరో త్రెంచివేశారు. అది వడిదుడుకుల్లో కొట్టుకుంటూ సుడిగుండాల వైపుకు పోవుచున్నది. అక్కడ మొసళ్లు తిమింగిలాలు యున్నవి. అవి కబళించివేయునో లేక తనకు తాను మునిగిపోవునో! నా కర్మవిధి. నా ఆనందమూర్తిని ఎవరో నానుండి దన్నుకొనిపోయినారు. అంత అందాల భరిణలో ఎంత కాలకూటవిషము పెట్టుకున్నాడు! తను ఒక వివాహితుడనని, తన భార్య రేపోమాపో మాతృమూర్తి కాబోతుందని మచ్చునకైన నాతో సంప్రతించలేదు. ఛీ... ఛీ... నేనే అతనిని తప్పుగా అర్థము చేసుకొనుచున్నాను. ఒక్కసారైన, నేనైనా దానిని గురించి ప్రస్తావించియుండిన ఇంత గొడవ వచ్చియుండెడిది కాదు. క్షణిక సౌఖ్యమునకు ఆశించి, యావజ్జీవనం నరక మనుభవించవలసి వచ్చినది. పెరిగిపోవుచున్న మా ప్రేమలతను అప్పుడే వ్రేళ్ళతో పెకలించి వేరేస్థలములో నాటియుండిన ఎంత బాగుండెడిది. గులాబి బాగా వికసించిందని త్రుంచుకొనుటకు పోయాను. దాని ప్రక్కనే ఒక ముళ్ళును అది పెంచుతున్నది అని తెలుసుకొనలేకపోయాను. నా జీవితములో మొదటిసారిగా పొరబడ్డాను. తొందరపాటు నాకీ గతికి తెచ్చింది. క్షణిక భోగమునకు నాలో రేగిన వాంఛారేఖలను ముడుచుకొనలేకపోయాను.

“నాకెన్ని కష్టాలైనా కలిగించు, కాని నా ఆనంద్ కు ఏ ఒక్క కొరత చూపకు” అంటూ కడసారిగా భగవానుని మనసార సేవించి, మెల్లిగా నిద్రించుటకు ప్రయత్నించాను.

పాత్రుడు గారి

బాల సంజీవిని (Regd)

పిల్లల లివర్ అండ్ స్ప్లీన్ వ్యాధులను నివారించును

డాక్టరు పిల్లా పాపయ్య పాత్రుడు అండ్ బ్రదర్స్,

19, దక్షిణ మాడవీధి, మైలాపూరు, మదరాసు-4. Phone 71354

కుంభకోణము బ్రాంచి: 7. సారంగపాణి కోవిల తూర్పువీధి.

అన్ని మందుల షాపులలోను దొరకును.